

# నేను మనిషిని

ట్రిగ్గర్ పై వేలు ఉంచి చూస్తున్న రాజు ఊపిరి ఒక్కసారి వేడెక్కింది. బలం అంతా వేలిలోనికి కేంద్రీకృతం చేశాడు. వేడెక్కిన ఊపిరి బిగపట్టి ముందు కదులుతున్న పొదలలోనికి నిశితంగా చూశాడు. చుట్టు పక్కల చిందరవందరగా గుట్టలు, పొదలు అల్లుకొని ఉన్నాయి. శత్రువులు వేసిన బాంబుకు అక్కడ పెద్ద గొయ్యి పడింది. దూరంగా చచ్చిపోయిన జంతువునుండి దుర్వాసన వస్తూంది. దానిని వెతుక్కుంటూ రాబందు ఒకటి వచ్చి దగ్గరలో వాలింది.

ఈ సారి మళ్లీ కదిలాయి చెట్లు.

ముందుకువెళ్లి ''హాండ్స్ అప్''అని అరిచాడు. లోపల నుంచి ఎటువంటి శబ్దము రాలేదు. ఈ సారి రాజు కొంచం చలించాడు. అయినా, [illegible] ఎటుపెక్కాయి. నెమ్మది నెమ్మదిగా మట్టి [illegible] అడ్డు చేసుకుంటూ పొదవరకు జరిగాడు. పొద... తుపాకీతో కదిలించాడు.

అంతే.

అడివి కుందేలు ఒకటి వెంగున దూకి రాజును రాసుకొంటూ అదృశ్యమై పోయింది.

చిన్నగా నవ్వుకున్నాడు రాజు.

తన తుపాకీ అంటే ప్రతి ప్రాణికీ భయమే. ఆ కుందేలు మంచివాడి హృదయంలా వెన్నెలలోని మల్లెపువ్వులా ఉంది. దానిని చూస్తూంటే తన ఆయుధంలోని కాఠిన్యం కరిగి ప్రవహించిపోతూంది. అయినా, తను దానిమీదే నిద్రపోవాలి. అది తన కర్తవ్యం. అంతే.

బైనాక్యులర్స్ తీసి చుట్టూ చూశాడు. దూరాన తన స్నేహితులు కందకాలు తవ్వుకుంటున్నారు. సింగ్ ఏదో చిన్న వస్తువు తీసి నిశితంగా పరిశీలిస్తున్నాడు. రహీం బాటిల్‌లోని నీళ్లు తలా కాసిని పోస్తున్నాడు. ఖాన్ సేయురా వల్లిస్తున్నాడు...

''అనుభవాల తెరలలో కర్తవ్యాన్ని దాచకు. జీవితంలో స్వార్థాన్ని ఇమడ్చకు...''

తుపాకీ కిందపెట్టి దానిమీద మోచెయ్యి ఆన్చి

**నియమ నిబంధనలు మనిషి తనకోసం ఏర్పరుచుకొన్నవి. నియమ నిబంధనలకోసం మనిషి లేడు. కాని కాలం గడిచేకొలది అదే పరిణామం సంభవిస్తుంది. కర్తవ్యపాలనకు, మానవత్వానికి సంఘర్షణ ఏర్పడుతుంది. విజయం ఎటు మొగ్గుతుందో ఎలా చెప్పడం?**

శూన్యంలోకి చూడసాగాడు రాజు.

సరిగ్గా అయిదు సంవత్సరాల క్రితం...

కర్తవ్యం అంటే ఏమిటో తెలియని రోజు ... జీవితంలో ఏదో పొందాలని కలిగే ఆరాటంతో ...

గుండెలలో ఒక్కొక్క కొత్త భావన వచ్చి ముసుగు వేసిన రోజు...

ఏదో సాధించాలి, సాధించాలి అని చూపులలో ఆవేశాన్ని మిళితం చేసిన రోజు...

ఉరకలు వేస్తూ పొంగుతున్న రక్తం ''భవిష్యత్తును పొందాలి, భాయీ'' అని పాఠం నేర్పిన రోజు...

''నీకు ఎల్. డి. సి. ఉద్యోగం సంపాదించేసరికి ప్రాణం పోయినంత పని అయింది, రాజూ!'' అప్పు నాన్న మాటలు చప్పగా వినపడ్డాయి.

తను మానవుడు. ప్రగతి సాధించాలి. భవిష్యత్తును సృష్టించుకోవాలి. తన నీడ తనకు శాంతి ప్రసాదించాలి కాని వెక్కిరించకూడదు. ఏదో సాధించాలనే తాపత్రయంలో మెట్రిక్ సర్టిఫికెట్ ఒక మెట్టు. ఏదో పొందాలనే ఉద్దేశంతో ఎల్. డి. సి. ఉద్యోగం చిన్న ఆశలాంటి తెర. ఇవేమీ తనకు తృప్తి ఇయ్యవు. వీటికన్నా అధిగమించి ఏదో పొందాలి. ఈ హద్దులలోనే తన జీవితం నశించి పోకూడదు.

''నాన్నా, ఇది జీవిత మంటారా?''

కొడి కట్టుతున్న దీపం దగ్గిర కూర్చుని జీవితపు మహాధ్యాయపు పాఠాలు చదవటానికి ప్రయత్నిస్తున్న జీరవారిన కళ్ళు కొడుకు వంక నిశితంగా చూశాయి. ఆ తండ్రి ముఖంలోకి పరిశీలనగా చూడటం ఆ కొడుక్కి అదే మొదటిసారి.

ముఖంలోని ప్రతి ఒక్క ముడత ఒక్కొక్క అనుభవాన్ని తెలుపుతున్నది. కన్నులకింద పడిన చారలు ఆత్మస్థైర్యాన్ని చాటుతున్నాయి. ఆ చూపులలో శాంతి, ఆవేదన మిళితమై ప్రవహిస్తున్నాయి.

తల దించుకున్నాడు రాజు.

''నాన్నా, ఇది జీవిత మంటారా?'' ముసలి హృదయంలో ఆ ప్రశ్న మళ్లీ కలుక్కుమంది.

''రాజూ!'' కంఠంలోని మార్దవం రాజును అధీనుణ్ణి చేసింది.

''కొడి కట్టుతున్న ఈ దీపం వంక చూడు. దీని వెలుతురులో భాగవతపు పద్యాలు చదవటం ఎంత బాధో ఊహించు. అయితే, మంచి దీపాల వెలుతురులో కూడా చదవలేం. ఆశలకు, అవకాశాలకు సామ్యం లేనప్పుడు జీవితం చప్పగా ఉంటుంది. ఈ ఆరిపోయే జ్యోతిని చూడు. దీని వెనక నీడ ఉంది. పైన వెలిగే చంద్రుణ్ణి చూడు. నీడ దాగి ఉంది. ఆ నీడలు లేనప్పుడు నేర్చుకోవలసింది ఏమీ లేదు. పొంగి పారుతున్న స్రవంతికి బండరాళ్ళు, కొండ గుట్టలే అనుభవం నేర్పుతాయి.''

ఆయన చాటుగా కన్నీళ్లు తుడుచుకోవటం గమనించాడు రాజు. మెల్లిగా బయటికి వచ్చాడు.

వడ్డించిన విస్తరిలాంటి జీవితం తనకు లేదు. అసలు అటువంటి జీవితం తన కక్కరలేదు. అయితే, హృదయంలో ఏదో సాధించాలనే ఆవేశం మాత్రం ముందుకు ఉరుకుతూంది. అదేమిటో తెలియటం లేదు. ప్రతి రక్త బిందువు ఏదో పొందాలని తాపత్రయపడుతూ ఉంది. ఏమి టది?

ఉవ్వెత్తున లేచి పడే తరంగం తనకు ఎంతపాట పాడింది.

కూకటివేళ్ళ పెకలించే పెనుగాలి తనకు ఏం పాఠం నేర్పింది.

ఉరుకుతున్న సెలయేరు ఆవేశాన్ని చవి చూపింది.

పొంగుతున్న పాలనురుగులోని లేత అర్థం కల్పించింది.

మరునాడు సాయంత్రం మళ్ళీ పందిరి పక్కన తన చేతిని నిమురుతూ అంది రాధ: ''బావా, ఇంత ఆవేదన నే నొక్కదాన్నే భరించనా?''

''రాధా! నన్ను నీవు బాగా అర్థం చేసుకున్నావు. నా ఆవేదన ఏమిటో నీకు తెలుసు. దానికి అర్థం కలిగిన రోజున నీ ఒడిలో వాలిపోతాను. అంతవరకు నేను ఎక్కడికి వెళ్లింది నాన్నతో చెప్పవద్దు.''

''బావా!''

''రాధా!''

ఉప్పొంగిన ఆవేగంతో ఇద్దరూ పెనవేసుకున్నారు. కన్నీటితో తడిసిపోయింది రాజు హృదయం.

''రాధా! నిన్ను విడిచి వెళ్లాలంటే నాలో కలిగే ఆవేదనను నా కళ్లలో వెతుకు. అయినా, తప్పకుండా వెళ్లాలి. నీ పెదవులమీద చిరునవ్వు, నీ కళ్లలోని కాంతి నాకు దారి చూపుతాయి. అవి లేకపోతే ఈ రాజు ఇక ఉండడు.''

కారుతున్న కన్నీరు తుడుచుకుంది రాధ. ''నీ ఆశయమే నా జీవితం. వెళ్లిరా, బావా!''

ఆమె చెక్కిలి నిమిరి ముందుకు అడుగు వేశాడు రాజు.

''నేను స్త్రీనని మరిచిపోకు, బావా.''

''రాధా! తెలుసు. పురుషుని జీవితానికి కరదీపికవు.'' రాజు కనుకొలకులలోనుంచి బిందువులు రాలి పచ్చి గడ్డిమీద వాలిపోయాయి.

సరిగ్గా రెండు సంవత్సరాలకు మిలిటరీలో చేరానని తండ్రికి వ్రాసిన జాబుకు వచ్చిన జవాబు చూసి ఆశ్చర్య పోయాడు.

''రాజూ!

జీవితం అంటే సాఫీగా సాగే స్రవంతి లాంటిది కాదు. చల్లగా ఉండే వెన్నెలలాంటిది కూడా కాదు. గులాబీని చూసి ఆనందించినప్పుడు దాని ముళ్లను కూడా సహించాలి. నీలో ఉన్న ఆవేశమేదో నాకు తెలుసు. కాని, నీకు తెలియదు. ఉరకలు వేస్తున్న పొంగు ఏదో వాలుకు ప్రసరించటానికి ప్రయత్నిస్తుంది. అంతే నీలోని

## పి. వెంకటేశ్వరరావు


**50 రవ్వల మడత పిస్తోలు**

లైసెన్సు అవసరం లేదు. అమెరికన్ మోడల్. దొంగల, వన్యమృగాల బారినుండి మిమ్మల్ని కాపాడుకొనండి. మహోత్సవాలకు, ప్రయాణాలకు, నాటకాలకు ఉపయోగమైనది. 50 రవ్వలతో ఆటోమాటిక్ ఏర్పాటు. తేలికైనది.




మిరుమిట్లుగొలిపే మంట మిమ్మల్ని ప్రమాదం నుంచి సురక్షితంగా ఉంచుతుంది. 50 రవ్వలతో జర్మన్ మాడల్ నం. 99 వెల రు. 15/50. వి.పి.పి. ఛార్జి 2/50. తోలుకేసు రు. 3/50. అదనపు రవ్వల నూరు రు.5/-.

**SANGAM TRADING CO. (WAP-15)**
**Beat No. 13, Aligarh.**

మీ కేశ శృంగారం ఎట్టిదైనాగాని



మీకు నిడుపాటి, నిగనిగలాడు అందమైన శిరోజాలకు

**కేశవర్ధిని**

*

ఉపయోగించుటకు సిద్ధముగా

**కేశవర్ధిని రెడిమిక్స్‌డ్ హేర్ ఆయిల్**

**కేశవర్ధిని షాంపు**

కేశములను శుభ్రంగాను, సువాసనతోను ఉంచును, సౌగంధిక పుష్పముల పొడి మరియు స్నానంపౌడర్ అన్ని పెద్ద స్టోర్లలోను లభించును.



**కేశవర్ధిని ప్రాడక్ట్సు, మద్రాసు–14.**

No. 9

ఆపేంకూడా. నువ్వు కొంత అనుభవం సంపాదించటానికి, నీ జీవితానికి సరితయిన మార్గాన్ని నిర్ణయించుకున్నావని తెలియగానే తండ్రిగా నేను చాలా గర్వపడతాను.

నీ
నాన్న.''

''బావా!

నువ్వు వెళ్లిన తరవాత మామయ్య ముందు సంతోషంగా ఉన్నట్లు నటించినా నేను చాలా పోగొట్టుకున్నానేమో అనిపించింది. కాని, నేర్చుకొన్నది కొంత ఉంది, బావా. పొందటంలో ఉన్న స్వార్థంకంటె పోగొట్టుకున్నదానిలో ఉన్న త్యాగంలో ఎక్కువ విలువ, ఎక్కువ సుఖము ఉన్నాయి. నా ఊపిరి నీ కోసమే ఆడుతూంది, బావా! నా చూపులు నీకోసమే ఎదురు చూస్తున్నాయి. ఈవేళ నా ఆరాధ్య దైవాన్ని ఏమని ప్రార్థించానో తెలుసా! 'నా రాజును చల్లగా చూడ'మని కాదు, 'నా రాజు అంతర్యానికి వేయూత నివ్వు, భగవాన్!' అని. నా ఆరాధన సబబుగా లేదా, బావా?

నీ
రాధ.''

ఇటువంటి ఉత్తరాలు తనకు ప్రాణం పోశాయి. వాటిని చదువుకుంటూ మరొక సంవత్సరం కూడా గడిపేశాడు.

ఆ రోజు నెల రోజుల సెలవు మీద ఇంటికి వెళ్లిన రోజు.

ఏదో సాధించానని హృదయంలో తృప్తిపొందిన రోజు.

తను పొందిన అనుభవం తనకు కరదీపికగా ఉపయోగపడుతుందని నమ్మకం కుదిరిన రోజు.

''నువ్వు రాధను పెళ్లి చేసుకో!'' అన్నాడు తండ్రి.

ఉలిక్కి పడ్డాడు రాజు. అన్నీ తెలిసిన తండ్రి కూడా ఇటువంటి సలహా ఇస్తాడనుకోలేదు. రాధను తా నే విధంగాను సుఖపెట్టలేడు. రాధను తను ఆరాధిస్తాడు. అయినప్పటికీ తన బాధల జీవితంలోకి రాధను భాగస్వామినిగా తీసుకోలేడు.

''నాన్నా, ఇందులో నీ స్వార్థం ఉంది కదూ?''

తండ్రిని నిలదీసి అడగటం ఇదే మొదటి సారి. ఆ ప్రశ్న అడిగేటప్పుడు అతని హృదయం జలదరించింది.

''ఏమి టది?''

''మిలిటరీలో ఉంటూ బ్రతుక్కి చరమాంకం ఎప్పుడో తెలియని నీ కొడుక్కి పెళ్లి కావాలి. కాని, ఇచ్చేవాళ్లు ఎవ్వరూ లేరు. అందుకోసం నువ్వు రాధను బలి చేస్తున్నావు.''

''పిచ్చివాడా! నన్ను కేవలం నువ్వు తండ్రి దృష్టితోనే చూస్తున్నావు. నీకు నేను తండ్రినే కాదు, ఆత్మీయుడను కూడా. ఆత్మీయుడు స్వార్థానికి దూరంగా ఉంటాడు. రాధను చేసుకోమనటంలో ఎటువంటి స్వార్థము లేదు. నీలో సాగే అస్పష్ట స్వరాలను రాధ లయబద్ధాలుగా చేస్తుంది. ఆమె వెలుగులో నువ్వు చాలా వెతుక్కోగలవనే నమ్మకం నాకు ఉంది.''

రాజు తల వంచుకున్నాడు.

''రాధను చేసుకోవటానికి నువ్వు ఎందుకు ఒప్పుకోవటం లేదో నాకు తెలుసు. రాధను సుఖపెట్టలేనని నువ్వు అనుకుంటున్నావు. నువ్వు రాధను ఎంత ప్రేమిం చావో నాకు తెలుసు. నీ ఉద్యోగం దృష్ట్యా ప్రేమను త్యాగం చేస్తున్నావు. నా కొడుకు హృదయంలో త్యాగ భావన ఒయలుదేరిం దంటే నేను తృప్తిగా నవ్వుకుంటాను. రాధ నీ కోసమే జీవిస్తూంది. నువ్వు లేకపోతే ఆమె జీవితం లేదు. ఎందుకంటే, ఆమె స్త్రీ. తన సర్వస్వాన్ని పురుషుడికి అంకితం చేస్తుంది.''

జీవితంలో ఎన్నో మైలు రాళ్లను దాటిన ఆయన చెప్పేది విని బయటకు వచ్చెయ్యటం తప్ప మరేమి చెయ్యలేకపోయాడు.

ఆలోచనలతో తల వేడెక్కింది. రాధను తన జీవితంలోకి తీసుకొని ఆమెకు ఇవ్వగలిగేది బహుకొద్ది. రాధ సుఖమే తనకు కావలసింది. అయినప్పుడు తను, రాధకు దూరంగానే ఉండాలి. దూరంనుంచే తన ప్రతి అణువు రాధ క్షేమం కోరుతుంది.

చీకటి ముసుగు వేసింది. నల్లగా పరుచుకున్న గగనంలో అక్కడక్కడ తెల్లని తారకలు మెరుస్తున్నాయి. ఇలకోడి పిచ్చిగా పాడుకొంటూంది. పెరట్లోని మామిడిచెట్టు మెల్లిగా ఊగుతూంది.

హోల్డాల్ భుజాన వేసుకొని బయటికి వచ్చాడు రాజు. ముప్పై రోజులు సెలవు పెట్టి వచ్చాడు. ముప్పై గంటలు కూడా ఉండటం లేదు. రాధకు దూరంగా రాధకు తెలియకుండా వెళ్లిపోవాలి—రాధ తనను స్వార్థపరుడని భావించినా సరే, తన త్యాగాన్ని అర్థంచేసుకోలేకపోయినా సరే.

వచ్చికమీద పడుతున్న అడుగులు హఠాత్తుగా ఆగిపోయాయి. వేడి బిందువులు రాజు పాదాల మీద జలజల రాలాయి. ఆ బిందువులు ఒక్కొక్కటే రాజు నరాలను జివ్వుమనిపిస్తున్నాయి.

పాదాల మీద రాధ వాలిపోయింది.

''నాకోసం నీ ప్రేమను త్యాగం చెయ్యగలిగినప్పుడు నీ కోసం నా జీవితాన్ని త్యాగం చెయ్యలేనా, బావా? నీ ఊహ లేని కాలం నా కక్కరలేదు. నీ నీడ లేకపోతే నా జీవితమే లేదు.''

''రాధా!'' చేతిలోని హోల్డాల్ కిందికి జారిపోయింది.

''నేను స్త్రీని, బావా! స్త్రీ ఒక్కసారి ప్రేమించిందంటే చచ్చిపోయినట్లే. నా నుంచి పారిపోను, బావా! లేకపోతే ఈ రాధ చచ్చిపోతుంది.''

''రాధా!'' తన హృదయంమీద తీగలా వాలిన రాధ ముంగురులు నిమరసాగాడు. ఆమె కన్నులలో దాగిన విషాదాన్ని గమనించాడు.

''రాధా! నీ అంతర్యం నాకు తెలుసు. నేనే నువ్వు. నువ్వే నేను.''

ఆ పురుషుని హృదిలో శాశ్వత శాంతిని వెతుకుతూ కరుచుకుపోయిం దా స్త్రీ.

''మరి, స్త్రీ అంటే ఏమనుకున్నావు, రాజా? ఆత్మ సమర్పణ చేసుకుని ఆహుతి కావటానికి కూడా సిద్ధపడుతుంది. ఆ ఆత్మలోని విలువ తెలియకే ఎన్నో జీవితాలు ఇంకిపోతాయి.''

తల ఎత్తాడు రాజు. ఎదురుగా తండ్రి.

ఇద్దరూ ఆయన పాదాల మీద వాలిపోయారు. వా రిద్దరినీ ఏమని దీవించాడో ఆ సర్వాంతర్యామికే తెలియాలి.

* * *

దూరంగా తుపాకీ మోత వినిపించేసరికి ఊహాలలో

# అంతర్వాణి

## కె. శ్రీనివాసరెడ్డి

**ఆనందానికి** ఆంక్షలిడుతూ
పరువానికి సంకెళ్ళు వేసి
అపురూపపు పరుగులుతీసే
మనో నందనాల మల్లె తోటలో
జిల్లేడులు మొలిపించలేను!
ముల్లులాగ బ్రతకలేను!

ఆదర్శాల భారతం వ్రాసి
ఆత్మనే వంచన కంకితమిచ్చి,
త్యాగాల మెడలో తాళికట్టి
నిరర్థకమైన తృప్తికోసం
జీవితమంతా విలపించలేను!
మనుగడ మసి చేయలేను!

విముఖమైన మనస్సు వికసించి,
కొండలాంటి కోరిక బరువు దించినప్పుడు
సభ్యతకోసం మొహమాట పడుతూ
పెదవులపై చిరునగవు
చిందించలేను, స్పందించలేను!
గరళామృతాలు గళంలో బంధించలేను!

దిగంతాలలో చొరబడే హృదయం నిగ్రహించి,
అనంతత్వాన్ని విడమర్చి చెప్పే
ఆలోచనాలోచనాలు మూసివేసి,
మొద్దు నిద్ర కౌగిలిలో
మన్ను తిన్న పాములా పడి ఉండలేను!
బ్రతుకులో చావు చవిచూడలేను!

జోగ్‌లా నయాగరాలా
జోరుగా జలజలా ప్రవహించే
ప్రాణికి సరిహద్దు లిడుతూ
పొంగి పొరలు కడలికి గట్లువేసి,
ప్రగతికి ఆనకట్ట కట్టలేను
నవతకు గీతలు గీయలేను!

ఊహాలోకాల నురక లిడుతూ
అనుకొన్నది సాధించగ పాటు పడక,
అపజయాలు తట్టుకోనే శక్తి లేక
అదృష్టాన్ని నిందించుతూ
లేని విధిని దూరలేను!
లేమిని దూషించలేను!

అగణ్య జీవకోటిలో నేనొంటరినై
ఊరు పేరు లేని అడవి మొక్కనై
కుక్కిన పేనులాగ, కుక్కగొడుగులాగ
పుట్టి కిట్టుతూ పుడమి మీద
అనామకుడుగా అణగారిపోలేను!
గుర్తింపు లేని బ్రతుకు ఈడవలేను! *

నుంచి ఉలిక్కి పడ్డాడు రాజు. చుట్టూ కలయ చూశాడు. తన స్నేహితులు ఎక్కడా అగుపడటంలేదు. దూరంగా గుట్టల చాటునుంచి గుళ్ళు దూసుకు వస్తున్నాయి. ఇటుపక్క కందకాల నుంచి కూడా గుళ్ళు దూసుకుపోతున్నాయి. కందకాలలో తన మిత్రులు ఉన్నారని గ్రహించాడు రాజు. తను కూడా పక్కనున్న పొదలలోనికి తప్పుకున్నాడు. ఎదురుగా అంతా ధూళి...మోత. సైన వివూనాల ఆక్రందనలు. హృదయాలలోని ఆరాటంతోపాటు పోరాటం హెచ్చు పెరిగిపోయింది. రాజు తుపాకీలోనుంచి గుళ్ళు దూసుకు పోతున్నాయి.

కొంచంసేపటికి సద్దు ఎణిగింది. శత్రుసైనికులు తమ స్థావరాన్ని వదిలి పారిపోయారు. రాజు నెమ్మదిగా పాకుకుంటూ ముందుకు వెళ్ళాడు. కొంచెం పక్కగా శత్రువులు వదిలివేసిన ఆయుధాలు పడి ఉన్నాయి. వాటిని పక్కకు తీసి మరికొంచెం ముందుకు వెళ్ళాడు. అంతే! రాజు కాళ్ళు హఠాత్తుగా ఆగిపోయాయి.

ఎదురుగా శత్రుసైనికుడు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఆ దృశ్యం చూడగానే రాజు హృదయం

# నేను మనిషిని

ఆందోళించింది. శత్రు సైనికులు మరణావస్థలో ఉన్న తన స్నేహితుణ్ణి వదిలి పారిపోయారు. దగ్గిరికి వెళ్ళాడు రాజు.

పడి ఉన్నసైనికుని పెదవులు దాహంతో అల్లల్లాడుతున్నాయి. ఎండి బీటలు వారుతున్న అవి ఆత్రతతో దప్పికకోసం కదులుతున్నాయి. నుదుటినుంచి రక్తం జాలువారుతూంది. కళ్ళలోనుంచి నీటి బిందువులు కూడా రాలటం గమనించిన రాజు అధీరుడయ్యాడు. గుండెలు కరగసాగాయి. అతడు శత్రువు అయినప్పటికీ తనలాంటి మానవుడు. తోటి ప్రాణికోసం తన హృదయంలో మమత, కరుణ దాగి ఉన్నాయి. అవి మానవత్వానికి ప్రతిరూపాలుగా నిలిచే జ్యోతులని తనకు తెలుసు.

జేబులోనుంచి దూది తీసి అతని గాయాలను తుడిచాడు. అతని తల ఒడిలోనికి తీసుకొని బాటిల్‌లోని నీళ్ళు కొద్ది కొద్దిగా పొయ్యసాగాడు. ఎండిపోతున్న ఆ పెదవులకు తడి తగలగానే తృప్తిగా కొత్త రంగు పులుము కున్నాయి. రాజు ముఖంలోకి అనుమానంగా చూసి కళ్ళు మూసుకున్నాడు క్షతగాత్రుడు.

"భాయీ! నువ్వు, నేను శత్రువులమే కావచ్చు. కాని, మానవులము. నేను మనిషినని నమ్మకం నాకుంది, భాయీ! అందుకే నిన్ను బ్రతికించటానికి ప్రయత్నిస్తున్నాను. మనిషికి, మనిషికి మధ్య ఉన్న అనుబంధమేమిటో ఈ పాటికి నీకు అర్థమయ్యే ఉంటుంది."

అతడు నీరసంగా నవ్వి తల పక్కకు వాల్చాడు.

ఒడిలో పడుకున్న క్షతగాత్రుణ్ణి చూడగానే రాజుకు ఎనలేని తృప్తి కలగసాగింది. తను జీవితంలో మానవుడుగా మానవత్వం చాటుకుంటున్నాడు. అంతేచాలు. తను చేసే త్యాగపు విలువ ఎంతో తనకక్కరలేదు. అతడు మళ్ళీ కళ్ళు తెరిచాడు. ఆకలి అన్నట్లు చెబుతున్నాయి అతని కళ్ళు.

"ఇక్కడినుంచి కదలకు, భాయీ! డేరాలో కోకో, బ్రెడ్ ఉన్నాయి తీసుకువస్తా" అని డేరావైపు పరిగెత్తాడు రాజు. అతడు పరిగెత్తుతున్న వైపు చూస్తూ ఉండిపోయాడు క్షతగాత్రుడు.

తిరిగి వచ్చేటప్పుడు రాజు ఆలోచించసాగాడు. తను శత్రుసైనికుణ్ణి బ్రతికిస్తున్నాడు. ఇది కర్తవ్యం దృష్ట్యా నేరమే. అయితే, మానవత దృష్ట్యా ఎన్నో విలువలు ఉన్నాయని తనకు తెలుసు. తన దృష్టిలో కర్తవ్యంకన్న త్యాగమే గొప్పది. తన చుట్టూ ఉన్న త్యాగాలను అర్థం చేసుకోలేకపోతే తను ఈ విధంగా నిలబడగలిగేవాడు కాదేమో!

బ్రెడ్, కోకోలతో తిరిగివచ్చేసరికి క్షతగాత్రుడు అక్కడ లేడు. రాజు ఆశ్చర్యపోయాడు. చుట్టూ కలయ చూశాడు. పాకివెళ్ళిన గుర్తులు అగుపడుతున్నాయి. మరికొంచెం ముందుకు వెళ్ళాడు. క్షతగాత్రుడి తుపాకీ మాత్రం అక్కడ పడి ఉంది. దానికి గుచ్చబడిన కాగితం విడదీసి చూశాడు రాజు.

"భాయీ!

నీ త్యాగం ముందు నేను ఓడిపోయాను. నీలో ఉన్న మానవత్వానికి నేను జోహారు లర్పిస్తున్నాను. నీ ముందు చచ్చిపోవటానికి కూడా నాకు ధైర్యం లేదు. అందుకే నాదని ఏమీ లేకుండా, చివరకు హృదయాన్ని కూడా నీకు అంకితం చేసి వెళ్ళిపోతున్నాను. ఎందుకో తెలుసా?... చచ్చిపోవటానికి.

నీ

భాయీ."

రాజు కన్నులనుండి రెండు బిందువులు నేలమీద జలజల రాలాయి.

భుజం తట్టుతూ అన్నాడు సింగ్. "నువ్వు చాలా గొప్పవాడివి, భాయీ!"

అప్పుడే అందిన ఉత్తరం రాజు చేతికి ఇచ్చి వెను తిరిగాడు సింగ్. రాజు ఉత్తరం విప్పాడు. "మగ పిల్లవాడు పుట్టాడు. అచ్చు మీ పోలికే." కింద—"మీ ఆశయమే నా జీవితం. మీ రాధ" అని వ్రాసి ఉంది.

తృప్తిగా శ్వాస వదిలాడు రాజు.

దూరాన ఖాన్ సేయరా మరింత ఉద్రేకంతో వినిపిస్తూంది.

"అనుభవాల తెరలలో కర్తవ్యాన్ని దాచకు
జీవితంలో స్వార్థాన్ని ఇమడ్చకు..." ★

నిర్మల మనస్సు

ఫోటో—రావు (హైదరాబాదు-20)

